
# నెరవేరిన కోరిక

మహమ్మద్ తహసీన్ అలి



"ఒరేయ్ రక్కు! రేపు రెండవ శనివారం కదా? రేపు ఇంట్లో ఉంటున్నావా? ఎటైనా వెళ్తున్నావా? " సాయంత్రం ఆఫీసు నుండి ఇంటికొచ్చిన కొడుకుని టీ కప్పు అందిస్తూ కదిపింది తల్లి.

"అదేం పిలుపమ్మా! రక్కు.... కక్కు అని. ఎంచక్కా రాకీ అని పిలవొచ్చుగా!"

"రాకీ....జాకీ.....కాకీ! అదేమిట్రా. అవి పశువుల పేర్లు, పక్షుల పేర్లు! అదేమో కాని నీకు రాకేశ్ అని పేరు పెట్టినప్పటి నుంచే అలా పిలవడం నా కలవాటై పోయింది. అన్నట్లు రేపటి సంగతేమిటి అని".

"రేపు నేనెటూ రావటం లేదు. ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటాను. గత ఆరు నెలలుగా నా సెలవుల్ని మట్టి కరిపిస్తున్నావు గదమ్మా. అయినా నీకు తృప్తి లేదా?" ఎగిరి గంతేశాడు రాకేశ్.

"ఎవరి కోసంరా నువ్వు తిరిగేది? నా కోసమా ఏమిటి?" తల్లి ఎదురు తిరిగింది.

"పెళ్ళి చూపుల పేర నా ఓపికను పరీక్షిస్తున్నావు గదమ్మా నువ్వు", కొడుకు మెత్తబడ్డాడు.

"రేపు మనం వెళ్తున్న సంబంధమేదైతే వుందో.... అమ్మాయి తండ్రి కమర్షియల్ టాక్స్ ఆఫీసరట. అమ్మాయేమో ఎమ్మెస్సి కంప్యూటర్ సైన్స్ చేసిందట. అమ్మాయి బాగుందని, కట్న-కానుకలకు కొదవుండదని సంబంధం చూసిపెట్టిన మన పక్కింటి మూర్తన్నయ్య చెప్తున్నారు." కొడుకునిమెల్లగా ముగ్గులోకి లాగుతోంది తల్లి.

"అమ్మా! నువ్వేమో.... ఆ అమ్మాయి బాగుంది. ఈ అమ్మాయి బాగుందని ఎన్ని సంబంధాలు చూడలేదు. తీరా నాకు తెలిసిందేమంటే అమ్మాయి కాదు, వాళ్ళిచ్చే కట్నాలు బాగున్నాయి. అందుకని అమ్మాయి నీ చూపుల్లో మెరుస్తుంది. మొన్న చూసొచ్చిన సంబంధం కంటే ముందు ఆ పల్లెటూరు సంబంధం చూసొచ్చామా! ఇంటికొచ్చాక నువ్వెంత హంగామా చేసావు, ఆ సంబంధం ఒప్పుకోమని అమ్మాయి చాలా బాగుందని తెగ పొగిడావు. చెప్పొద్దుగాని ఆ అమ్మాయి గున్నేనుగు మాదిరుంది. గజలక్ష్మి. లక్ష్మి వస్తుందని నువ్వు

ఇష్టపడుతున్నావు. ఆ సంబంధం చేసుకుందామని నా ప్రాణం తీస్తున్నావు". మనసులోని వ్యధను వెలిబుచ్చాడు రాకేష్.

"ఏరా! ఆ అమ్మాయి నీ కళ్ళకు అంత లావు అగుపిస్తోందా! నిజానికి అమ్మాయి బొద్దుగా ఆరోగ్యంగా ఉంది. ఉన్నఇల్లు. నౌకర్లు- చాకర్లుతిరిగే భవంతి వ్యవసాయం, పలుకుబడి ఉన్నవాళ్ళు. పాడిపశువులతో కళకళలాగే ఇల్లది. పాలు, పెరుగు, నెయ్యికి లోటు లేదు. అందుకే అమ్మాయి గుండ్రంగా - నున్నగా ఉంది. అయినా ఆ మాత్రం లావులేకపోతే ఇంటి చాకిరి ఎలా చేసుకుంటుంది. నువ్వు కోరుకున్నట్లు సన్నగా రివటలా వుంటే రాణిగారిని కూర్చోబెట్టి నువ్వే ఊడిగం చేయాల్సిందే. " తల్లి ఆ అమ్మాయిని వెనకేసుకొచ్చింది.

"అమ్మా! నువ్వెన్నైనా చెప్పు.ఆ అమ్మాయి నాకు సుతరాము నచ్చలేదు." రాకేష్ ఖరాఖండిగా చెప్పేశాడు

"మరైతే ఇంకేం.ఇది సిటిలోని సంబంధమే. రేపొకసారి అలా వెళ్ళోస్తే పోలా?" అవకాశం చూసి తల్లి బాణం సంధించింది.

"ఇక చాలమ్మా. నేను పెళ్ళిచూపులకంటూ ర ు."

"అంటే పెళ్ళంటూ చేసుకోకుండా జోలెవేసుకొని జోగి వౌతావ్రా?" తల్లి వ్యంగ్యంగా పలికింది.

రాకేష్ తల్లి మాటలను పట్టించుకోలేదు. ప్రశాంతంగా, మెల్లగా మదిలోని మాటను వ్యక్తపరిచాడు.

"అదేం కాదులే. అన్నట్లు అమ్మా! గత ఆదివారం కాక అంతకు ముందు ఆదివారం వెళ్ళొచ్చామే... ఆ అమ్మాయి ఎంతో బాగుందమ్మా. నాకు నచ్చింది. ఆ సంబంధం చేసుకుంటే...."

**జమ్నాలాల్ బజాజ్ జయంతి**

4 నవంబర్1888న రాజస్థాన్‌లోని జయపూర్‌లో జన్మించారు. వార్ధాలో లక్ష్మినారాయణ దేవాలయం నిర్మించి దళితులకు ప్రవేశం కల్పించాడు. 1921 నుంచి జీవితాంతం అఖిల భారత చేనేత కార్మికుల సంఘానికి అధ్యక్షునిగా ఉన్నాడు. గ్రామాభివృద్ధికి దోహదం చేసే వరిజ్ఞానాన్ని పెంపొందించే వారికి ఈయన పేరు మీద మూడేళ్ళకొకసారి లక్షరూ॥ల నగదుతో అవార్డు ఇస్తున్నారు.

"నిజమే శాంతం. ఆ అమ్మాయి కుందనపు బొమ్మలా ఎంతో చక్కగా ఉంది." అక్కడే సోఫాలో కూలబడి మౌనముద్ర దాల్చి తల్లీ- కొడుకుల సంభాషణని వింటూ కూర్చున్న తండ్రి ఉండబట్టలేక మనసులోని మాటను కక్కేసాడు.

"ఆహా! మీ కళ్ళూ ఆ అమ్మాయి మీద పడ్డాయా? ఇంకేం! ఆ ముదనష్టపు కళ్ళూ.... మీరూనూ..... ఫ్రిజ్‌లోని చల్లని నీళ్ళతో ఆ కుళ్ళు కళ్ళు కడుక్కుని రండి,పోండి." కసురుకుంది శాంతమ్మ.

"అదేం శాంత! అలా అంటావు? ఈ కళ్ళే కదా నిన్ను కోరుకున్నవి." భర్త చలాకీగా బదులిచ్చాడు.

"కళ్ళకేం కొదవ! మీరు కాకపోతే తొంభై జతల కళ్ళు మిటకరిస్తూ వచ్చేవి. నేనే లేకపోతే నిన్నెవరే చేసుకునేది అన్నాడట వెనకట ఎవరో మీలాంటి వాడే" శాంతం భర్తను దెప్పి పొడిచింది.

విషయం రూటు మారుతున్నట్లు గ్రహించిన రాకేష్ "అమ్మా! నువ్వేమైనా అను. ఆ అమ్మాయి చాలా బాగుందమ్మా," ఉండబట్టలేక మళ్ళీ తన మనోభావాన్ని వెలిబుచ్చాడు.

"పిచ్చి సన్నాసి! ఆ అమ్మాయే కాదురా. ఆ వయస్సులో ఏ అమ్మాయైనా నిగనిగలాడ్తూ అందంగా ఆకర్షణీయంగా ఉంటుందిరా. నువ్వేమో ఆ అమ్మాయిలో ఏం చూశావో ఏమో గాని ఆ సంబంధం వైపు మొగ్గుతున్నావు. అయినా ఆ అమ్మాయి బాగాబక్క చిక్కి లేదురా?" కొడుకు మనస్సు మార్చే ఉద్దేశంతో వెటకారంగా పలికింది తల్లి.

"అమ్మా! నువ్వు చెప్పేది నిజమే కావచ్చు. కాని నన్నొట్టి చవటను చేయకు. నేనెందరు అమ్మాయిల్ని చూస్తూ రావడంలేదు. నా హైస్కూలు రోజుల్లో ఎందరు అమ్మాయిల్ని చూడలేదు... కాలేజిలో ఎందర్నిచూడలేదు...బి.టెక్., ఎం.టెక్

చదివే రోజుల్లో ఎందరమ్మాయిల్ని చూడలేదు..... నాకు ఇంగితం వచ్చినప్పటి నుండి ఇక్కడ - అక్కడ బయట ఎందరో అమ్మాయిల్ని చూస్తూ వస్తున్నాను. కాని ఇలాంటి అమ్మాయి ఇంత వరకు నాకంట పడలేదమ్మా." రాకేష్ ధైర్యాన్నికూడగట్టుకొని తన మనస్సులోని మాటను వ్యక్త పరిచాడు.

"అద్సరే గాని వాళ్ళేం ఇచ్చే స్థితిలో లేర్రా.. అబ్బాయి పెళ్ళి చేసి అప్పుల పాలౌదామా? ఏమండి! మీరలా బండలా కూరుకుపోయారు సోఫాలో. వాడేమేమో చెప్తున్నాడు. వింటున్నారా! ఏమైనా అర్థమౌతోందా?"" కొడుకు మీద కోపాన్ని భర్త మీద చివాట్ల దుమ్ము దులిపింది శాంతమ్మ.

హఠాత్తుగా వచ్చిపడ్డ యీ దుమ్ముని దులుపుకొనే ప్రయత్నంలో కొంత తడబడి, అంతలోనే సర్దుకొని "శాంతం! వాడేమైనా చిన్న పిల్లోడా! నన్ను దబాయించినట్లు వాడ్ని దబాయిస్తే ఎలా? అయినా పదమ్మాయిల్ని చూశాక తనకు నచ్చినమ్మాయి ఎవరో నిర్మొహమాటంగాచెప్పాడు. వాడికి నచ్చినమ్మాయితో పెళ్ళి జరిపించడం మన ధర్మం. అయినా డబ్బువెుహం చూసి వాడికిష్టంలేని అమ్మాయినంటగడ్తే వాడి సంసారం సజావుగా ఎలా వుంటుంది చెప్పు. వాడికి మనశ్శాంతి లేకుండా చేయడం భావ్యం కాదు శాంత." సౌమ్యంగా భార్యకు నచ్చజెప్పే ప్రయత్నంచేశాడు వెంకటేశం.

శాంతమ్మ భర్త మాటలకు అగ్గిమీద గుగ్గిలమైంది. "నీతులకేం ఎవరైనా చెప్తారు. పెళ్ళంటే మాటలా? పెళ్ళి ఖర్చు లెక్కడనుంచొస్తాయి. వాడి చదువులకే లక్షలు కుమ్మరించామా. ఉద్యోగానికెంత ఖర్చయింది మీకు తెలియందా. అయినా మేమేదైనా ఇంతిమ్మని - అంతిమ్మని డిమాండు చేస్తున్నామా. ఇంటికొచ్చే లక్ష్మిని వద్దంటామా! ఎంతపచారం!" తప్పుచేసిపట్టుబడ్డ పిల్లోడికి మల్లె లెంపకాయ లేసుకుంది కాంతం.

"శాంతం! చెప్పొద్దు గాని కట్న కానుకలు తీసుకోకుండా మనం అబ్బాయిపెళ్ళి చేయలేమంటావా? అయినా మనకేం తక్కువైందనీ! దేవునిదయవల్ల మనకన్నీ సమకూరాయి. ఒక్కగానొక్క కొడుకు. అబ్బాయి సుఖమే మన సుఖం. రాకేష్ పెళ్ళి వాడికి నచ్చినమ్మాయితో చేయడమే సబబు. అదే నా అభీష్టం కూడా" ఎలాగూ కొడుకు సపోర్టు తనకుందని కాబోలు ధైర్యం తెచ్చుకొని కుండెత్తేశాడు వెంకటేశం.

"తన కుందని అడ్డమైన ఖర్చులు చేసుకుంటూ పోతే చిప్పే గతి. తినడానికి తిండి లేదు మీసాలకు సంపెంగ నూనె. అబ్బో! ఉందీ... ఉందీ అని డప్పు వాయించి మరీ అరుస్తున్నారు. ఏంటో ఉంది. నాకు తెలియకుండ బ్యాంకులో ఎన్ని కోట్లుదాచారేంటి? కారుందా? ఏ.సి. ఉందాఇంట్లో? ఉన్న యీ కొంపొకటితప్ప ఎన్ని భవంతులు కట్టారని. ఎన్ని,ఎన్ని చోట్ల ప్లాట్లు, ఫ్లాట్లున్నాయి మీకు చెప్పండి." ఆయనెత్తేసిన కుండ యీవిడ కాలుమీద పడిందేమో గయ్యిమని ఒంటికాలి మీద లేచింది.

"అమ్మా.... అమ్మా.... ఇదిగో అమ్మా! ప్లీజ్ నామాట విను. అయినా నాన్నకు నీకంటే ఎక్కువేం తెలుసని. నాన్నేమో నోరు జారినట్లనిపిస్తోంది. ఇంకా నయం కాలు జారలేదు. అమ్మా! నువ్వు చెప్పింది నూటికి నూరుపాళ్ళు నిజం. అయినా ఎందరో... ఎందరెందరో జీవితాలను చూసి, చదివి దాని సారం గదా నువ్వు చెప్పింది. జాలి గుండె కారణంగా ఎందరో దానం చేసి చేసి-మట్టి చిప్ప చేతబుచ్చుకొని రోడ్డెక్కలేదు. మనకూ ఆ గతి పట్టవద్దనే గదా నువ్వు నెత్తి కొట్టుకునేది." అమ్మ మనసెరిగిన కొడుకు తల్లి గుండె బూరలో గాలి ఊదాడు.

ఊదిన బూర గాలిలో తేలింది. మనసు కొంత తేలిక

## సర్ సి.వి. రామన్ జయంతి

సి.వి. రామన్ 7-11-1888న తిరుచినాపల్లి సమీపంలో జన్మించారు. 1907లో ఉద్యోగం చేస్తూ అక్కడి ఇండియన్ సైన్స్ అసోసియేషన్‌కు రోజూ వెళ్ళి కాంతిపై పరిశోధనలు చేసుకునే వారు. 'రామన్ ఎఫెక్ట్'ని కనిపెట్టాడు. 1930 డిసెంబర్‌లో రామన్‌కు నోబెల్ బహుమతి ప్రకటింపబడింది. వీరికి 'భారతరత్న' (1954) అవార్డు బహూకరింపబడింది. ఫిబ్రవరి 28ని 'నేషనల్ సైన్స్‌డే'గా జరుపుకుంటున్నారు.

పడింది." మన రక్కుకున్న జ్ఞానం మీకు లేదాయె'', శాంతం శాంతించింది.

"అంతా నీ పోలికే వాడిది. నీకున్న అపారమైన జ్ఞానంలోంచి వాడికింత వంచావు. నా కొంచెపు ఆలోచన,లేకిడితనం వాడికబ్బ లేదు.'' కొడుకు ఊదిన బూరలో తనూ ఇంత ఊదాడు వెంకటేశం.

రాకేష్ అలర్ట్ అయ్యాడు. అమ్మో! ఇంకేమైనా ఉందా. బూర పగిలేట్టుంది. కొంత గాలి తీయంది లాభం లేదనుకొని, "అమ్మా! అద్సరే గాని అన్నిటికీ డబ్బుతో సరితూచవద్దమ్మా. డబ్బుతో కాని పనులూ కొన్నుంటాయి. కొన్ని పరిస్థితులల్లో డబ్బు ఎందుకూ పనికి రాదు. ఆప్యాయత నిండిన ఒక్కమాట చాలు".

"అవున్రా! ఇప్పుడు నేనేమన్నానని. పెళ్ళంటే మాటలా! అబ్బాయి పెళ్ళైతే మాత్రం ఖర్చుండదా. తోబుట్టిన వాళ్ళు, దగ్గరి బంధువులకు కట్నాలు, వంటలు, వార్పులు, వ్రతాలు...ఎన్నని చెప్పను." శాంత మెత్తబడింది.

శాంతవడ్డ తల్లిని చూసి కొడుకు అందుకున్నాడు. "నువ్వన్నట్లు పెళ్ళంటే ఖర్చే. ఖర్చొక్కటే కాదు. పెళ్ళికి కొన్ని రోజుల ముందే ఎన్నో పనులు చూసుకోవల్సి ఉంటుంది. ఇంటిమరమ్మత్తులు, అలంకరణ పనులు, షాపింగులు, వంటల ఏర్పాట్లు.... ఎన్నని..... ఇదో పెద్ద తతంగం. పని ఒత్తిడికి ఒళ్ళుకూడా హూనమై పోతుంది. అందుకే అమ్మా! ఇవన్నీ లేకుండా కూడా పెళ్ళి చేయవచ్చు....."

కొడుకు మాట పూర్తి చేయకముందే తల్లి ప్రశ్నించింది. "ఖర్చు లేకుండా పెళ్ళి! అదెలా సాధ్యంరా?"

"ఏముందమ్మా. గుళ్ళో పెళ్ళి చేసుకుంటే సరి", టూకీగా బదులిచ్చాడురాకేష్.

**బోల్షివిక్ విప్లవం**

లెనిన్ నాయకత్వంలో బోల్షివిక్ విప్లవం విజయవంతం అయ్యింది. జార్ చక్రవర్తి పాలన అంతంఅయ్యింది. రష్యాలో 7-11-1917న సువ్యవస్థిత మైన కమ్యూనిస్టు ప్రభుత్వ పాలన ప్రారంభమైంది. అప్పుడు రష్యాలో అనుసరింప బడుతున్న క్యాలెండర్ ప్రకారం ఈ విప్లవం 1917 అక్టోబర్‌లో జరిగింది. అందువల్లనే ఈ విప్లవాన్ని 'అక్టోబర్ విప్లవం' అని కూడ పిలుస్తారు.

"ఇంత బ్రతుకు బ్రతికి గుళ్ళో పెళ్ళా? ఓ ఆలనా లేదు - పాలనా లేదు. మన హోదాకు తగ్గట్టు పది మంది గొప్పగా చెప్పుకొనేట్లు జరిపించాలి గాని. అదేంపెళ్ళి. నలుగురూ నాలుగు మాటలంటారు. తల తీసేసినట్లు కాదూ?" శాంతం బాధపడ్తూ కొడుకు మాటను ఖండించింది.

"నలుగురి మెప్పు కోసం డబ్బు ఖర్చు చేయడం వృథా. పెళ్ళనగానే అనవసరపు ఖర్చులు, ఇతరత్రా హంగులు ఎక్కువ. ఇవన్నీ ఎందుకు శాంతం! పెళ్ళి నిరాడంబరంగా చేయడం అన్నిటికీ మంచిది. శాంతం! నువ్వు గొప్పలకు, పంతాలు పట్టింపులకు పోక స్థిమితపడ్డ మనస్సుతో యీ విషయం ఆలోచించు. రాకేష్ చెప్పిందాంట్లోని యధార్థాన్ని, మంచిని గురించి ఆలోచించు". వెంకటేశం మృదువుగా, ప్రేమతో, సంయమనంతో భార్యను ఆలోచింపజేశాడు.

హాల్లో నిశ్శబ్దం ఆవహించింది. ముగ్గురూ ఆలోచనలోపడ్డారు. ఎవరూ మాట్లాడడం లేదు.

కొంత సేపయ్యాక శాంతమే మౌనం వీడింది. "మీ కిష్టమైతే నాకూ ఇష్టమే. నేనెప్పుడు మీ మాట కాదన్నానని కాని వాళ్ళిచ్చేది చాలా తక్కువ అందుకని....."

"అమ్మా! వాళ్ళివ్వదల్చుకొన్నదేమైనా అదీ మనకొద్దు. వాళ్ళేం ఇచ్చినా .... ఎంతిచ్చినా అమ్మాయి ఏదో ఒక సందర్భంగా ఏప్పుడో ఒకప్పుడు దెప్పి పొడిచే అవకాశం రావచ్చు. అలా అనిపించుకోవడం నా కిష్టం లేదు. నాపెళ్ళికి ఎలాంటిహంగామా అవసరం లేదు. పెద్ద ఖర్చులేదు. మన తరపున ఒక నలుగురు, వాళ్ళవైపున ఓ నలుగురు మనకు దగ్గర్లో వున్న గుళ్ళో కెళ్ళి పెళ్ళి జరిపిస్తే చాలు" తల్లి చెప్పదల్చుకున్న మాటనూహించి రాకేష్ మధ్యలోనే అడ్డుకున్నాడు.

"మరి వాళ్ళూ మీలాగే ఆలోచించాలి

గదా. పెళ్ళంటేనే అందరికీ అందం.... ఆనందం. ఎలాంటి సంబరం, పెళ్ళి సందడి లేకుండా వాళ్ళమ్మాయి పెళ్ళికి వాళ్ళు ఒప్పుకోవద్దూ? పెళ్ళిళ్ళలో అనాదిగా పాటిస్తూ వస్తున్న ఆచార వ్యవహారాలను ఒదిలేసి గొప్ప సంస్కర్తలమనుకొనే మీతో వాళ్ళు ఏకీభవించ వద్దూ?" శాంతం తన మదిలోని సందేహాన్ని వెలిబుచ్చింది. ఆమాటలో ఒకింత హేళనా ఉంది. వాళ్ళెలాగూ తిరస్కరిస్తారన్న ధీమా ఉంది.

"ఓ మంచి సంబంధం కుదిరి ఎలాంటికట్న కానుకలు లేకుండా, పెళ్ళి ఖర్చులు లేకుండా అమ్మాయి పెళ్ళి సాదా సీదాగా, సజావుగా జరిగే అవకాశం వుంటే ఏ అమ్మాయి గాని, ఆమె తల్లి దండ్రులుగాని ఒప్పుకోకుండా ఉంటారు. వాళ్ళు మన సంబంధాన్ని తప్పకుండా ఒప్పుకుంటారని నా నమ్మకం". తన అభిప్రాయాన్ని, ఆశను వ్యక్తపరిచాడు వెంకటేశం.

''అయినా వాళ్ళ అభిప్రాయం తెలుసుకోవడం ఎంతైనా అవసరం. అందుకే అమ్మా! రేపే మనం వాళ్ళింటికెళ్దాం. అన్ని విషయాలు వాళ్ళతో మాట్లాడాక ఓ నిర్ణయానికి వద్దాం. అమ్మాయికెలాంటి అభ్యంతరముండకపోవచ్చని నాకనిపిస్తోంది."తన కోరిక నెరవేరే అవకాశం వస్తున్నదుకు రాకేష్ ఆనందించాడు.

"వాళ్ళు సమ్మతిస్తారన్న నమ్మకం మీకిద్దరికీ ఉన్నప్పుడు మరింకేం రేపు మీరిద్దరే వెళ్ళిరండి. నేనెందుకు మధ్యలో" శాంతం చిన్నబుచ్చుకుంది.

తల్లి బుంగమూతిని చూసిన రాకేష్ సర్దుకున్నాడు. "అదేంటమ్మా అలాగంటావు. నువ్వు తోడులేంది వాళ్ళడిగే నానా ప్రశ్నలకి నాన్నకి జవాబు స్పురిస్తుందా? నిన్ను చూసి గదా నాన్న పులివేషం వేసేది.. అయినా అమ్మా! నీకున్నే సమయస్ఫూర్తి నాన్నకెక్కడిదీ? అన్నట్లు నువ్వు రాకుండా ఉంటే అమ్మాయితో మాట్లాడే ధైర్యం నాకు లేదమ్మా. నీ అండ చూసుకొని గదా అమ్మాయితో రెండు ముక్కలు మాట్లాడగలను. నీకు రావడం ఇష్టం లేదంటే ఆ అమ్మాయి నీకు నచ్చనట్లే.'' రాకేష్ అలుపు పాన్పునెక్కాడు.

కొడుకేమంటాడో తెలుసుకుందామని అలా అన్నదే తప్ప తను మనస్ఫూర్తిగా అనలేదు. అందుకే "సరే! నేను రెడీ మనం రేపే వెళ్దాం". అనికొద్దిసేపాగి శాంతం కొడుకుని ఆటపట్టించింది. "అన్నట్లు రక్కూ! నువ్వు రేపెటూ రాను, ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటా నన్నావుగదరా."

"పో అమ్మా! నువ్వు మరీను" అంటూ రాకేష్ కుర్చీ నుంచి లేచి సోఫాలో కూర్చున్న తల్లి దగ్గరికెళ్ళి ఆమె కాళ్ళ దగ్గర క్రింద కూర్చొని తలను తల్లి ఒళ్ళోకి దూర్చాడు.

వెంకటేశం ఆ దృశ్యాన్ని చూసి పులకించిపోయాడు. "పిచ్చి సన్నాసి! అమ్మనెంత మస్కా కొడ్తున్నాడు" అనుకున్నాడు మనసులో. ★

